క్లుప్తంగా

రాజీ మార్గమే మేలు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మంగాకుమారి

ఏలూరు (టూటౌన్) : కక్షిదారులు స్నేహపూరిత వాతావరణంలో ఉండాలంటే రాజీ మార్గాన్నే అనుసరించాలని మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికారం సంస్థ భవన్‌లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పగలు, కక్షలు, కార్పణ్యాలకు పోయి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగవద్దని సూచించారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్న కేసులపై న్యాయస్థానాలకు వెళ్లే అవకాశం లేదని తెలిపారు. రాజీ పొందిన కక్షిదారులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, 8వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, ఎస్‌ఈబీ ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.శశిధర్ రెడ్డి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి



బీజేపీ సెంట్రల్ కార్యాలయంలో దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కొత్తపేటలోని బీజేపీ సెంట్రల్ కమిటీ కార్యాలయంలో శనివారం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు బాడిత నారాయణరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొర్లపాటి జ్యోతి సుధాకర్ కృష్ణ హాజరయ్యారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజలకు చేరువచేసేందుకు ప్రతిన బూనారు. నాయకులు గొంతిన సర్వేశ్వరరావు, కోట్ని పార్వతి, వేల్పూరి వాసుదేవరావు, ఎస్‌కే వలీ, హరికృష్ణ, శివ, నానాజీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పశ్చిమ మండలం ఆధ్వర్యంలో..

స్థానిక శాంతినగర్‌లోని జనసంఘ్ వ్యవస్థాపకుడు, బీజేపీ సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నడపన దానభాస్కరరావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా రాజకీయాలు ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆకాంక్షించారని గుర్తుచేశారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి



శనివారపుపేట దర్గాలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక శనివారపుపేటలో జరిగిన హజరత్ సయ్యద్ జమాల్ షా బాబా మహాత్ముని ఉరుసు కార్యక్రమంలో నాని పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోరుతూ దర్గాలో నాని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంక్షేమ పాలన అందిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని, నానిని ఆశీర్వదిస్తూ, ముస్లిం మైనారిటీలకు అండగా నిలుస్తున్న జగనన్న ప్రభుత్వం మరోసారి రావాలని కోరుతూ దర్గా ముజావర్లు ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ హామీల్లో భాగంగా ఇటీవల ప్రవేశపెట్టిన షాదీ తోఫా పథకం ద్వారా సీఎం జగన్ పేద ముస్లిం కుటుంబాలకు వారి బిడ్డల పెళ్లికి అండగా నిలిచారని చెప్పారు. నామినేటెడ్ పదవుల్లోనూ జగనన్న ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించారన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో ఏలూరులోని పలు మసీదులు, దర్గాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున అండగా నిలిచామని నాని తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా శనివారపు పేటలోని హజరత్ సయ్యద్ జమాల్ షా బాబా మహాత్ముని దర్గాలో ఉరుసు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయంమని అన్నారు. తొలుత దర్గా నిర్వాహకులు నానికి పుష్పగుచ్ఛం అందించి ముస్లిం సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, కార్పొరేటర్ గునిపూడి శ్రీనివాస్, ఇమ్మానియేల్ జయకర్, పార్టీ నాయకులు కిలాడి దుర్గారావు, నిడికొండ నరేంద్ర, ఎల్లపు మోజెస్, హజరత్ సయ్యద్ బాయజీద్ దర్గా ముజావర్లు షేక్ షాబీర్ హుస్సేన్, షేక్ షబ్బీర్ హుస్సేన్, పోలీస్ లైన్ మస్జీద్ కమిటీ అధ్యక్షుడు రసూల్ , పెన్షన్ మహల్లా మస్జీద్ కమిటీ అధ్యక్షుడు నజీర్, సెక్రటరీ అక్రం, అహ్మదుల్లా ఖాన్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాలి



ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పద్మజ్యోతి శ్రీనివాస్

ఏలూరు టౌన్: హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే నాని సూచించారు. ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులుగా పెద్దిరెడ్డి పద్మజ్యోతిని ప్రభుత్వం ఇటీవల నియమించింది. దీంతో ఆమె ఏలూరులో ఎమ్మెల్యే, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు నానిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యునిగా నియమించటంలో ప్రోత్సహించిన ఎమ్మెల్యే నానికి ప్రత్యేకంగా పద్మజ్యోతి, శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పార్టీ కోసం నిస్వార్థంగా సేవలు అందించే ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా నిలుస్తుందని, ప్రజా సంక్షేమ పాలనను అందిసున్న వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావటానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని గుర్తుచేశారు. ద్వారకాతిరుమల దేవస్థానం ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా సేవలు అందించాలని సూచించారు. నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మౌలిక సదుపాయాలు, సేవలు అందించాలని ఎమ్మెల్యే నాని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, నాయకులు చెలికాని రాజబాబు తదితరులు ఉన్నారు.

ప్రజాసేవే లక్ష్యం.. తండ్రి ఆశయాలే స్ఫూర్తి





కంభం శామ్యూల్ ప్రవీణ్ గౌతమ్, ఆయన తల్లిదండ్రులు విజయరాజు, శ్రీలత, కుటుంబ సభ్యులు

ఏలూరు టౌన్: ప్రజా సేవ చేయాలనే తపన.. తండ్రి విజయరాజు ఆశయాల స్ఫూర్తితో ముందుకెళుతున్నారు ఏలూరుకు చెందిన కంభం శామ్యూల్ ప్రవీణ్ గౌతమ్. పాసింగ్ అవుట్ పరేడ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని, ఐపీఎస్ అధికారిగా శనివారం ఆయన హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. ప్రవీణ్ గౌతమ్ పాఠశాల విద్య ఏలూరు సీఎస్ఐ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో, ఎస్‌ఆర్ఐ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్య ను పూర్తి చేశారు. ప్రతిష్టాత్మక తిరుచ్చి ఎన్ఐటీ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పట్టభద్రులయ్యారు. ఢిల్లీలోని వాజీరామ్‌లో సివిల్స్ శిక్షణ తీసుకున్నారు. సివిల్స్ పరీక్షల్లో రెండో సారే ఉత్తమ ర్యాంకు సాధించి ఐపీఎస్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ 2020 బ్యాచ్‌లో ఎంపికయ్యారు. కరోనా వల్ల 2021 బ్యాచ్‌లో ఐపీఎస్ అధికారిగా శిక్షణ పూర్తి చేసుకుని, శనివారం అమిత్‌షా నియామక పత్రాన్ని అందుకున్నారు.

తండ్రి ఆశయ స్ఫూర్తితో..

ఏలూరు జిల్లా కామవరపుకోట ప్రాంతానికి చెందిన కంభం విజయరాజు రవాణా శాఖలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా, తల్లి నీరజ శ్రీలత జెడ్పీ ఉన్నత పాఠశాల కలపర్రులో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా ఆయన ఏలూరు నగరంలోనే స్థిర నివాసం ఉంటున్నారు. తల్లి శ్రీలత, తండ్రి విజయరాజు ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తోన్న విధానాన్ని చిన్ననాటి నుంచీ చూస్తున్న ప్రవీణ్ గౌతమ్ పట్టుదలతో సివిల్స్ పరీక్షలు ఉత్తీర్ణులయ్యారు. ఐపీఎస్ అధికారిగా ఎంపికవ్వడం విశేషం. విజయరాజుకు ఇద్దరు కుమార్తెలు షైనీ, ప్రదీప్తి, చిన్న కుమారుడు ప్రణయ్ తేజ ఉన్నారు.

అలరించిన పౌరాణిక నాటక ప్రదర్శన



పౌరాణిక నాటకంలోని ఒక సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా శనివారం నాటక కళాకారులు ప్రదర్శించిన పౌరాణిక నాటకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీసీతారామాంజనేయ భక్త సమాజం బృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం వేదాంతం విష్ణుప్రసాద్ హైందవ ధర్మ విశిష్టత అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి 7 గంటలకు పెరికిగూడెంకు చెందిన శ్యామలాంబ కళానికేతన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకంలోని మయ సభ, పడక సీనులను వి.రామాంజనేయులు (శ్రీకృష్ణుడు), బి.అప్పారావు (అర్జునుడు), ఎస్.సీతారామయ్య (దుర్యోధనుడు) తమతమ పాత్రలతో ఆద్యంతం రక్తి కట్టించారు. తొలుత అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మూడు రాజధానులకే మద్దతు



మాట్లాడుతున్న చంద్రమౌళి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటుకు తమ మద్దతు ఇస్తున్నట్టు నవసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి తెలిపారు. స్థానిక మల్కాపురంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను సమాన అభివృద్ధి చేసే విధంగా అధికార వికేంద్రీకరణ, పరిపాలనా సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల అంశానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. అమరావతి రాజధాని వల్ల ఆ ప్రాంతమే అభివృద్ధి చెందుతుందన్నారు. ఒకే చోట అధికారం కేంద్రీకృతం కావడం వల్ల జరిగిన అనర్థాలను ఇప్పటికే చేశామన్నారు. కేంద్రం అమరావతి రాజధానికి మొగ్గు చూపుతున్నట్టు ఇటీవల ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు చెప్పడం అబద్ధమన్నారు. రాజధాని అంశం సుప్రీం కోర్టులో ఉందని గుర్తు చేశారు. శ్రీకృష్ణ కమిటీ నివేదికను చంద్రబాబునాయుడు తుంగలో తొక్కారని విమర్శించారు. వచ్చే 2024 ఎన్నికల్లో ప్రభుత్వ ఓటు చీలకుండా చూస్తామని చంద్రమౌళి వివరించారు.

నేడు యూటీఎఫ్ జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఏలూరు జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ద్వారకాతిరుమలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ప్రారంభ సభ, అనంతరం కౌన్సిల్ సమావేశం, సాయంత్రం 4 గంటలకు నూతన కమిటీ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ప్రసంగిస్తారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కన్వీనర్ హైమావతి

ఏలూరు (టూటౌన్): దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల ప్రజలను వివక్షకు గురి చేసిన, మహిళల పట్ల వివక్ష చూపిన మనుధర్మ శాస్త్రం అమలు చేయాలనే బీజేపీ ప్రభుత్వం వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని ఐద్వా జిల్లా కార్యాలయంలో కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ మనుధర్మ శాస్త్రం పద్ధతులను అమలు చేయాలని చూస్తోందని, దీనికి ఇటీవల పార్లమెంటులో సతీ సహగమనం మన సంప్రదాయం, దీన్ని అమలు చేయాలని సాక్షాత్తు బీజేపీ ఎంపీ ప్రకటించడమే నిదర్శనమని వివరించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి వచ్చాక గ్యాస్ సిలిండర్ ధర రూ.400 నుంచి రూ.1100కు, పెట్రోల్ లీటరు రూ.45 నుంచి రూ.112కు పెరిగిందని, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు నిర్మల, దివ్య, ఉషారాణి,జి.శారద, పెద్దాని సుకన్య తదితరులు పాల్గొన్నారు.

స్వార్థం, సంకుచిత స్వభావాలను వీడండి



దివ్య బలిపూజ నిర్వహిస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో శాంతి స్థాపనకు స్వార్థం, సంకుచిత స్వభావాలను విడనాడాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథిడ్రల్ మహాలయం 35వ వార్షికోత్సవం, లూర్థుమాత మహోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆలయం పవిత్ర స్థానమని, అది ప్రజలకు రక్షణను, ఆయురారోగ్యాలను, శాంతి సమాధానాలను అందించే సాధనమని తెలిపారు. కథిడ్రల్ విచారణకర్త, మహోత్సవ నిర్వాహకులు ఫాదర్ మైఖేల్ ఇంజమాల మాట్లాడుతూ బిషప్ జయరావు ఏలూరు పీఠాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. తొలుత మేరీమాత స్వరూపంతో అపోస్తులు రాజ్ఞి సెమినరీ నుంచి కథిడ్రల్ ఆలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించి దివ్య బలి పూజ చేశారు. కార్యక్రమంలో ఫాదర్లు పి.బాల, టి.ఇమ్మానియేలు, జి.మోజెస్, మాథ్యూ కల్లికాట్, బి.రాజు, డి.ఆరోన్, డి.అబ్రహాం, కార్పొరేటర్ నిర్మలా జేవియర్, ఏఎంసీ డైరెక్టర్ జె.బెనర్జీ పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆ శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య తెలిపారు. శనివారం స్థానిక బ్రహ్మకుమారీస్ ఏలూరు శాఖ సేవా కేంద్రంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభిస్తారని, దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను స్థానిక శ్రీరామ్ నగర్‌లోని తమ సేవా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. 19వ తేదీ వరకు ఈ జ్యోతిర్లింగాలను దర్శించుకుని, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదించాలని కోరారు. కార్యక్రమాల్లో ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు, బ్రహ్మకుమారీస్ వరంగల్ జోన్ డైరెక్టర్, రాజయోగిని బీకే సవిత, బీకే సుధాకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో బీకే మమత, బీకే హిమబిందు, బీకే రాణి, బీకే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): నిమ్మ, అరటి, కూరగాయల తదితర ఉద్యానవన పంటల రైతుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో శనివారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొండ పందిర్ల సబ్సిడీ బకాయిలు నాలుగేళ్లుగా ఇవ్వకపోవడం, మార్కెట్లో కనీస ధర రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని కోరారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీలు అందించాలన్నారు. సామాజిక వన విభాగం 2019–20 ఆర్థిక సంవత్సరంలో అటవీ శాఖ ద్వారా చేపట్టిన కొబ్బరి మొక్కల పెంపకం, పంపిణీలో చోటుచేసుకున్న భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

ఉచిత ఆయుర్వేద వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ప్రార్థనా గాన సంఘం భవనంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు ఐవీఎం నగేష్ 92 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారని లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు తెలిపారు. ప్రతి నెలా రెండో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రార్థనా గాన సంఘ భవనంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని వెల్లడించారు.

దంత సంరక్షణకు అత్యాధునిక వైద్య చికిత్సలు

పెదవేగి : దంత సంరక్షణకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఇటలీకి చెందిన ప్రముఖ దంత వైద్యులు జియోవాని కావల్లి అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో ఈనెల 8 నుంచి 11 వరకు సీడీఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు, కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్, ఫాదర్‌లు రాజు, డామినిక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జియోవాని కావల్లి దంత వైద్య విధానంలో ఆధునిక పరికరాల ప్రాముఖ్యత, వాటి వినియోగం ద్వారా దంత సమస్యల నివారణను వివరించారు. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలను విద్యార్థులకు తెలియజేశారు. పంటి సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం వల్ల మొదటి దశలోనే నివారించవచ్చని వివరించారు. దంత చికిత్స అంటే పన్ను తీసి, వేయించుకోవడమే కాకుండా మరిన్ని ఆధునిక చికిత్సల ద్వారా దంతాన్ని సంరక్షించుకోవచ్చని అన్నారు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాతో సత్కరించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



వెంకటాపురంలో చెరువు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న అక్కినేని రాజశేఖర్

పెదపాడు: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ అన్నారు. పెదపాడు మండలం వీరమ్మకుంట శివారు వెంకటాపురంలో మంచినీటి చెరువు అభివృద్ధి పనులను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వెంకటాపురం మంచినీటి చెరువును 25 ఏళ్ల క్రితం అభివృద్ధి చేశారని, నీరు బాగుండటం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకురావడంతో చెరువును అభివృద్ధి చేయాలని ఆదేశించారని తెలిపారు. మంచినీటి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడ ఉన్న నీటిని బయటకు పంపి మరలా కొత్తనీటితో చెరువును నింపుతామని చెప్పారు. దీంతోపాటు తుప్పలను తొలగించి గట్లను పటిష్టపర్చడం, పూడిక తొలగింపు పనులు చేపట్టినట్టు తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు మెంబరు గండికోట యోహాను, గ్రామ సచివాలయం కన్వీనర్ గండికోట శ్రీను నక్కా శివకృష్ణ, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	10	చిక్కుడు కాయలు	24
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	12–15
బెండకాయలు	44	కంద	40
పచ్చిమిర్చి	22	బీట్‌రూట్	28
కాకర కాయలు	30–36	కీరా దోస	30
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	08
దొండకాయలు	30	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	22	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	22–32	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	09
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	16
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	00
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	23
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	28
ఏలూరు – తిరుపతి	16.00	4830	33